క్లుప్తంగా

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



విలసవిల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.8 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో వీవర్స్ కాలనీలో రూ.5 లక్షలు, రంగా సెంటర్‌లో రూ.3 లక్షల నిధులతో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్టు సర్పంచ్ ఊర్మిళాదేవి తెలిపారు. గ్రామంలో దఫ దఫాలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్స్యాల ఏసు, ముత్యాల వెంకటనారాయణ, నందుల సత్య, గంపల బున్ని, అడబాల సురేష్, పిచ్చిక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం



జేవీవీ జెండాను ఆవిష్కరించి ప్లకార్డులను ప్రదర్శిస్తున్న జిల్లా జేవీవీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆవిర్భావ, జాతీయ సైన్స్ దినోత్సవాలను బుధవారం నిర్వహించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం జేవీవీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీవీ లక్ష్యాలు, ఆశయాలకు సంస్థ ప్రతినిధులంతా పునరంకితం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కోశాధికారి త్రినాథ్, బీఎస్ వెంకటేశ్వరరరావు, డి.శ్రీరామమూర్తి, డి.నాగేంద్రరాజు, వి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు వైద్యుడు లేక నిలిచిన ఆపరేషన్లు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా మత్తు వైద్యుడు లేక ఆపరేషన్లు నిలిచిపోయాయని జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌కు పలువురు బుధవారం ఫిర్యాదుచేశారు. ప్రధానంగా ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు, సర్జన్‌లు ఉన్నా కేవలం మత్తు వైద్యుడు లేని కారణంగా నాలుగు నెలలుగా గర్భిణులకు కాన్పులు జరగడం లేదన్నారు. దీంతో పేదలైన గర్భిణులు జీజీహెచ్‌కు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మత్తు వైద్యుడిని నియమించాలని కోరారు. దీనిపై జీజీహెచ్ డీడీ రవిశంకర్‌ను వివరణ కోరగా మత్తు వైద్యుడి నియామకం కోసం పుదుచ్చేరి ఉన్నతాధికారులకు లేఖ రాశానన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఓడలరేవులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో లయన్స్ క్లబ్ వశిష్ట అమలాపురం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వేమగిరి డివైన్ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆసుపత్రికి చెందిన వైద్య బృందం 297 మందికి పరీక్షలు నిర్వహించగా 110 మందికి దృష్టి లోపం ఉన్నట్టుగా, 15 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని గుర్తించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఉమామహేశ్వరరావు, దేశిరాజు పద్మ, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, చవటపల్లి సుష్మ, సంజయ్ ఓట్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారికి శంకుస్థాపన



తాళ్లరేవులో రహదారికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి

తాళ్లరేవు: స్థానిక పెంకేవారి పేట నుంచి శ్మశాన వాటికకు వెళ్లే సీసీ రహదారి నిర్మాణానికి సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షల వ్యయంతో గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, బొంతు వీరమోహన్, నేరేడిమిల్లి ఈశ్వరరావు, కుడుపూడి దేవి, పిల్లి మణికంఠ, గాడి సత్తిబాబు, గీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: టైలరింగ్ నేర్చుకోవడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధిని పొంది ఆర్థికాభివృద్ధిని సాధించే అవకాశం ఉంటుందని తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. టైలర్స్ డే సందర్భంగా బుధవారం క్రీం సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు ఆధ్వర్యంలో సేవా సంస్థ అధ్యక్షురాలు డి.వెంకట నాగదుర్గాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శామ్యూల్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు, ఉప్పంగల, జార్జిపేట సెంటర్లలో శిక్షణ పొందిన 70 మంది మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. కార్యక్రమంలో కొరమాటి నాగేశ్వరరావు, శాఖా శంకరుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

అమలాపురం టౌన్: ది అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం వీధిలోని చంద్రా టైలర్స్ ప్రాంగణంలో టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అలనాటి లవకుశ చలన చిత్రం కుశుడు పాత్రధారి, రాష్ట్ర టైలర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని టైలర్స్ జెండాను ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన టైలర్ పెద్దిరెడ్డి మంగ తాయారు కుమార్తె మీనాక్షి దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న దృష్ట్యా ఆమెకు టైలర్స్ అసోసియేషన్ తరఫున రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, అమలాపురం రూరల్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు ఎస్.అరుణకుమారి, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, కొమానపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వెన్నా వెంకటరమణ, కార్యదర్శి విత్తనాల బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా టైలర్‌కు సత్కారం

అమలాపురం టౌన్: గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఉపాధ్యక్షురాలు గోటేటి లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి వీధిలో టైలర్స్ డే కార్యక్రమం బుధవారం జరిగింది. గత 30 ఏళ్లుగా టైలరింగ్ వృత్తితో జీవనోపాధి పొందుతున్న పట్టణంలోని వంకాయలవారి వీధికి చెందిన మహిళా టైలర్ కన్నా నాగమణిని ఘనంగా సత్కరించి అభినందించారు. గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఉపాధ్యక్షురాలు గోటేటి లక్ష్మి, సర్కిల్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి నాగేశ్వరరావు, యర్రమిల్లి అనంతలక్ష్మి, పుత్సా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో శ్రీసాయి లక్ష్మీగణపతి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొర్రెల గోవిందరాజులు, రాయి శివ నాగేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, గుబ్బల త్రిమూర్తులు, ఆకుల నారాయణరావు, రాయుడు సత్యనారాయణ, కడలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన నవోదయ అభ్యుదయ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతి వేడుకలను స్థానిక గేటు సెంటరులో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కాట్రేనికోన మావుళ్ళ ఆలయం సమీపంలో మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు విత్తనాల వెంకట ప్రసాద్ చిన్నారులకు స్వీట్లు, పండ్లు పంచారు. మావుళ్ళ ఆలయం నుంచి గేటు సెంటరు వరకూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వి.సత్తిబాబు, బాషా, శ్రీను, వెంకటేశ్వరరావు, రమణ, సతీష్ పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని అల్లవరం, దేవగుప్తం గ్రామాల్లో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర, సిద్ధి వినాయక టైలర్స్ సంఘాల ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్లవరంలో నూతన టైలర్స్ కమిటీని ఎన్నుకున్నారు.

యానాం: స్థానిక శ్రీవిఘ్నేశ్వర టైలర్స్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవాన్ని, టైలర్స్ డే వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ భవనానికి లక్షలాది రూపాయల విలువ చేసే 100 మీటర్ల స్థలాన్ని ఇస్తున్నట్లు వంశీ టైలర్స్ నేమాలి లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మి దంపతులు ప్రకటించారు. భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రూ.2 లక్షలు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు రూ.3 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, యర్రా సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



మీనాక్షికి రూ.20 వేల సాయాన్ని అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



మహిళా టైలర్ నాగమణిని సత్కరిస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు



గొల్లవిల్లిలో విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు

ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం ఇస్తున్న ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ద్వారా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 97 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ల్యాప్‌టాప్‌లు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను కేవలం తమ విద్యకు సంబంధించిన అంశాలు, పాఠ్యాంశాలను చూడటానికి ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, ప్రిన్సిపాల్ ఉమ, పీఈటీ పాలికి ప్రకాష్ పాల్గొన్నారు.

రైతులకు ఉపకరించే పనులు రూపొందించాలి

డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

తాళ్లరేవు: ఉపాధి హామీలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడే పనులు రూపొందించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీని ఆమె సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో జూన్ నెల వరకూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. రైతులకు ఉపకరించే సీటి కుంతలు, కొబ్బరి చెట్ల చుట్టూ బాదులు తీయడం, చెరువు గట్ల మధ్య కొబ్బరి మొక్కల పెంపకం వంటి పనులు రూపొందించాలన్నారు. 5 వేల మొక్కలు పెంచే రైతులకు రూ.30 వేలు ఉపాధి హామీ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మండల కార్యాలయంలో నర్సరీ అభివృద్ధి చేయాలని కోరారు. సామాజిక తనిఖీలో రూ.10 వేలు రికవరీ చేసినట్టు తెలిపారు. పనులకు సంబంధించి ఫైలింగ్, రికార్డుల నిర్వహణ బాగుందని అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, ఏపీవో అన్నపూర్ణ, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సృజనకు వేదిక.. విజ్ఞాన వీచిక



అమలాపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు



యానాం రీజెన్సీలో స్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



యానాంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల సందడి

ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం

అమలాపురం టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలు అందరినీ అబ్బురపరిచాయి. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే బుధవారం విజ్ఞానదాయకంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ విద్యార్థులకు సైన్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, జోనల్ చైర్మన్ యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక నవోదయ విద్యాలయలో జరిగిన కార్యక్రమంలో సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా సైన్స్‌డే ప్రత్యేకతలను తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రకాశరావు మాట్లాడుతూ సైన్స్ లేనిదే మనుగడ లేదని, మనం చేసే ప్రతి చర్య సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేగం, రాహుల్ ద్వివేది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక రీజెన్సీ స్కూల్‌లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో హెచ్‌ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల స్థాయిలో నిర్వహించిన సైన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాదరావు, టీచర్లు అశ్విని, క్రాంతికుమార్, వరలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

యానాం: నియోజకవర్గ పరిధి శివారు గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఇన్‌చార్జి డెలిగేట్ కమిడి ప్రభాకర్, హెచ్‌ఎం దంగేటి త్రిమూర్తులు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి, కవిదాట్ల దేవదానంరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సైన్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గిరియాంపేట హైస్కూల్, రీజెన్సీ స్కూల్, నల్లం రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

మామిడికుదురు: స్థానిక వాసంశెట్టివారిపాలెం హైస్కూల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయం విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక లక్ష్మీగణపతి హోమం ఘనంగా జరిగింది. దీంతో పాటు కుంకుమార్చనలు, హోమం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, విశేష పూజ, గణపతి తాళం, వేద స్వస్తి తదితర పూజలను ఘనంగా జరిపించారు. వాసంశెట్టి సత్యనారాయణ మూర్తి, వెంకటరమాకాంత్‌బాబు, కవిత దంపతులతో ఈ పూజలను ఘనంగా జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణ మూర్తి, మట్టపర్తి త్రిమూర్తులు, గంగారత్నం దంపతులు, వాసంశెట్టి వెంకట్రావు, ఓలేటి సత్యం ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఘనంగా వీరభద్రస్వామి మహోత్సవాలు...

పాశర్లపూడి ఉత్తరబాధవలో వీరభద్రస్వామి 71 వార్షికోత్సవ పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.35 గంటలకు స్వామి వారి ఉత్సవాలకు కలశ స్థాపన జరిగింది. కాశీభట్ల కామేశ్వరసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీ వరకు అయిదు రోజులు పాటు స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: బ్రహ్మాండ నాయకుడికి తన కుమారుడైన బ్రహ్మదేవుడు తొలిసారిగా చేయించిన ఉత్సవంగా బ్రహ్మోత్సవం అని ప్రతీతి. ఎక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయో అక్కడికి సకల దేవతలు విచ్చేసి వేంకటేశ్వర స్వామి వారిని సేవించుకుంటారని భక్తుల విశ్వాసం. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి తొలి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 29న గురువారం నుంచి ఆరంభమై ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ నేతృత్వంలో భక్తుల సహకారంతో ఐదు రోజుల పాటు తిరుమల తిరుపతి తరహాలో ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నిత్యఉత్తర ద్వార దర్శనం ఈ ఆలయ ప్రత్యేకత

ముక్కోటి ఏకాదశి రోజు వైకుంఠంలోని ఉత్తర ద్వారం వద్ద శ్రీహరి తన ఉభయదేవేరులతో దేవతలకు సాక్షాత్కరిస్తారు. దేవతలు, మునులు, యోగులు స్వామివారిని సేవించుకుని తరిస్తారు. వైష్ణవులే కాకుండా సకల భక్తులు శ్రీహరి ఉత్తర ద్వార దర్శనాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. వైకుంఠ ఏకాదశి మహా పర్వదినం రోజు ప్రతి వైష్ణవాలయం భూలోక వైకుంఠాన్ని తలపిస్తూ భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. మరి అంతటి ప్రాముఖ్యం ఉన్న ఉత్తర ద్వార దర్శన భాగ్యం భక్తులకు ప్రతి రోజు కలిగే క్షేత్రమే మండలంలోని చింతలూరులో ఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రం. ఈ స్వామి వారిని ఇక్కడ ఎవరు ఎప్పుడు ప్రతిష్ఠించారో తెలియదు. ఉభయ తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడ కూడా లేని విధంగా ఈ క్షేత్రంలో స్వామి వారు ఉత్తర ముఖ సింహద్వారంలో భక్తులకు దర్శనమిస్తూ ఉంటారు. అత్యంత మనోహరంగా దర్శనమిచ్చే ఈ స్వామి వారి రూపాన్ని దర్శించి తరించాల్సిందే.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

యానాం: ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం యానాం ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల సమాఖ్య(సీవైజీఈఏ) నాయకుల ఆధ్వర్యంలో ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2004 తర్వాత గ్రూప్-సీ పోస్టులో చేరి 20 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు ప్రస్తుతం కేవలం రూ.2,600 మాత్రమే పింఛన్ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, జనరల్ సెక్రటరీ ఎ.శివప్రసాద్, కేఎల్‌వీ ప్రసాద్, ఇ.శివప్రసాదరావు, కె.రవికుమార్, ఎం.శ్రీనివాస్, కె.రమేష్ పాల్గొన్నారు.

పక్షవాతం బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో మంచాన పడిన బాధితుడికి స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందజేసినట్లు బుధవారం సంస్థ సభ్యులు తెలిపారు. ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన కోలా సోమయ్యకి రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చి కాళ్లు చేతులు పనిచేయడం లేదు. మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి. జీవనాధారం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వస్తున్న పింఛన్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాయం చేయమని కోరడంతో రూ.14,500, 25 కేజీల బియ్యం బస్తా రూ.1500 కిరణా వస్తువులు అందజేసినట్టు తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



బండారులంక ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణం సూర్యనగర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల, బండారులంక జెడ్పీ ఉన్నత పాఠశాలలను సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో తాగునీటికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు, విద్యుదీకరణ, ఫ్యాన్లు, లైట్లు ఏ విధంగా పనిచేస్తున్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీ మధుసూదనరావు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

నేటి నుంచి నిర్మలాశ్రమం వార్షికారాధన

తాళ్లరేవు: మండలంలోని చినబొడ్డు వెంకటాయపాలెంలో ఉన్న శ్రీధర నిర్మలాశ్రమం 60వ వార్షికారాధన మహోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయని ఆశ్రమం ప్రతినిధి కె.బాలకృష్ణ తెలిపారు. నిర్మలాంబ మహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విశేష పూజలు, ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు రాష్ట్రం నలుమూలల నుంచి గురువులు హాజరవుతారని తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులను సాధారణ విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, ఎస్ఎస్ఏ కమిడి ప్రభాకర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నూకరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: ఇంటింటికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ రెడ్డి హేమసుందరి సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. శిబిరంలో 307 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పెన్మత్స చిట్టిరాజు, రెడ్డి శివన్నారాయణ, దాసరి అన్నపూర్ణ, వెంకటేశ్వరరావు, రేకాడి వర్మ, మాదేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రథం షెడ్డుకు చేరిన స్వామివారి రథం

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో బుధవారం రథం షెడ్డుకు లక్ష్మీనృసింహుని రథం చేరింది. క్షేత్రంలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు పూర్తయిన తరుణంలో 16 స్తంభాల మండపం వద్ద ఉన్న ఈ రథాన్ని ఆలయ అధికారుల పర్యవేక్షణలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు, వాహనకారులు, భక్తులు కలసి ఆలయం ప్రాంగణంలోని షెడ్డులోకి చేర్చారు. ఉత్సవాల్లో 16న రథసప్తమి రోజున రథాన్ని రథం షెడ్డు నుంచి మెరకవీధికి చేర్చారు. 20న స్వామివారి రథోత్సవం పూర్తయిన అనంతరం రథాన్ని 16 స్తంభాల మండపం వద్ద నిలుపుదల చేశారు.

వైభవంగా వార్షికోత్సవం

అంబాజీపేట: మాచవరం పంచాయతీ శివారు నందెపువారిపాలెంలో వేంచేసిన పట్టాభిరామస్వామి 16వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా గంధం వెంకటేశ్వరరావు, సుభాషిణి దంపతులతో కలస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి మహిళలు అభిషేకాలు, పుష్పాలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకూ ఏకాహం నిర్వహించారు.

భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: ముంగండలో ముత్యాలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యం వహించారు.